


చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



టమాట కిలో రూ.32

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.32 పలికింది. కనిష్టంగా రూ.15, సరాసరిన రూ.24 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం 38.1°/22.7°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

చికెన్ సెంటరులో కొండ చిలువ కలకలం



కొండ చిలువను పట్టుకున్న స్నేక్ క్యాచర్ మూర్తి

ప్రశాంతి నిలయం: ఓ చికెన్ సెంటరులోకి కొండచిలువ ప్రవేశించడంతో కలకలం రేగింది. ఈ ఘటన సోమవారం పుట్టపర్తి మండల పరిధిలో జరిగింది. స్థానిక ఎనుములపల్లి చెరువు సమీపాన చిత్రావతి బైపాస్ రోడ్డుకు ఆనుకుని ముక్తార్ అనే వ్యక్తి చికెన్ సెంటరు నిర్వహిస్తున్నాడు. వెనుక ఉన్న కొండలో నుంచి ఆదివారం రాత్రి కొండ చిలువ చికెన్ సెంటరులోకి ప్రవేశించింది. నాలుగు బ్రాయిలర్ కోళ్లను తినేసిన తర్వాత నీటి డ్రమ్ములోకి చేరుకుంది. సోమవారం ఉదయం ముక్తార్ నీటి కోసం డ్రమ్ము వద్దకు వెళ్లగా..కొండ చిలువ కన్పించింది. దాదాపు తొమ్మిది అడుగుల పొడవు ఉంది. భయభ్రాంతులకు గురైన అతను చుట్టుపక్కల వారికి చెప్పడంతో వారు కూడా భయంతో పరుగులు తీశారు. చివరకు పుట్టపర్తికి చెందిన స్నేక్ క్యాచర్ మూర్తికి సమాచారం ఇవ్వడంతో అతను అక్కడికి చేరుకుని కొండచిలువను చాకచక్యంగా పట్టుకున్నాడు. తర్వాత అటవీ ప్రాంతంలో వదిలి పెట్టాడు.

జిల్లాలోకి ప్రవేశించిన కృష్ణా జలాలు



హంద్రీ-నీవా ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న కృష్ణా జలాలు

వజ్రకరూరు: జిల్లాలోకి కృష్ణా జలాలు ప్రవేశించాయి. ఈ నెల16న కర్నూలు జిల్లా మల్యాల వద్ద హంద్రీ-నీవా ప్రధాన కాలువకు రెండు పంపులతో నీటి పంపింగ్ ప్రారంభించారు. ప్రస్తుతం ఆరు పంపులతో పంపింగ్ చేస్తున్నారు. సోమవారం ఉదయానికి అనంతపురం జిల్లా సరిహద్దు అయిన 144 కిలోమీటరు వద్దకు జలాలు చేరాయి. రాత్రికి రాగులపాడు ఎత్తిపోతల(లిఫ్ట్)కు చేరుకున్నాయి. హంద్రీ-నీవా ప్రధాన కాలువలో కృష్ణా జలాలు ప్రవహించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. 155వ కిలోమీటరు వద్ద హంద్రీ-నీవా ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న కృష్ణా జలాలను ఈఈ రాజశేఖర్ పరిశీలించారు. మంగళవారం రాగులపాడు ఎత్తిపోతల నుంచి జీడిపల్లి రిజర్వాయర్‌కు నీటి పంపింగ్ ప్రారంభం కానున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఈ-క్రాప్ వేగవంతం చేయాలి

అనంతపురం అర్బన్: ఖరీఫ్ సీజన్ సాగుకు సంబంధించి ఈ క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. వివిధ అంశాలపై జేసీ సోమవారం కలెక్టరేట్ నుంచి ఆర్డీఓలు, నియోజకవర్గ, మండలస్థాయి అధికారులు, మునిసిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ సిబ్బంది క్షేత్రస్థాయిలోకి వెళ్లి సెప్టెంబరు 15లోగా ఈ-క్రాప్ నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. పీఎం కిసాన్ పథకానికి సంబంధించి పోర్టల్‌లో రైతుల వివరాలను అప్‌డేట్ చేయాలని చెప్పారు. బియ్యం కార్డులు మంజూరైన లబ్ధిదారులకు త్వరగా అందజేయాలని ఆదేశించారు. సమగ్ర రీ-సర్వే పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ ప్రశాంత్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాకు 1,237 మెట్రిక్ టన్నుల ఎరువులు



ఎరువులను పరిశీలిస్తున్న ఏడీఏ రవి, ఏఓ ప్రసాద్

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ ఎరువుల ప్రణాళికలో నెలవారీ కోటా మేరకు సోమవారం కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ నుంచి 1,237 మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాకు సరఫరా అయినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ ఎం.రవి తెలిపారు. రాప్తాడు ఏఓ వెంకటేశ్వర ప్రసాద్‌తో కలసి ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్‌కు వెళ్లి వ్యాగన్ల ద్వారా వచ్చిన ఎరువులను పరిశీలించారు. అందులో డీఏపీ 1,125 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 112 మెట్రిక్ టన్నులు వచ్చాయని తెలిపారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఏఓ ఆదేశాల మేరకు మొదటి ప్రాధాన్యతగా ఆర్‌బీకేలు, సహకార సంఘాలకు సరఫరా చేసి, మిగతావి హోల్‌సేల్, ప్రైవేట్ డీలర్లకు సరఫరా చేస్తామని చెప్పారు.

గ్రామీణ వికాసం

- 'గడప గడపకూ' తిరిగిన ఎమ్మెల్యేలు
- ప్రజల సమస్యల గుర్తింపు.. సత్వర పరిష్కారం
- పథకాల మంజూరులో ఇబ్బందులూ తొలగింపు
- మౌలిక సదుపాయాలతో సంతోషం
- జిల్లాలో 2,300 పనుల కోసం రూ.72.80 కోట్ల నిధులు

గ్రామీణ ప్రాంతాల్లో ఏళ్ల తరబడి ఉన్న సమస్యలకు సత్వర పరిష్కారానికి వేదికగా 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిలిచింది. గడప గడపకూ వచ్చిన శాసనసభ్యుల దృష్టికి వచ్చిన రోడ్లు, డ్రెయినేజీలు, కరెంటు పోళ్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, తాగునీటి సౌకర్యం, సీసీ రోడ్లు ఇలా ఎన్నో మౌలిక సదుపాయాలు వారాల వ్యవధిలోనే కల్పించారు. ఇంటింటికీ వచ్చి సమస్యలపై ఆరా తీసి.. సంక్షేమ పథకాల మంజూరులో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని తెలుసుకుంటున్న ఎమ్మెల్యేలకు ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదిస్తున్నారు.



పెద్దపప్పూరు మండలం రామకోటి కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు

సాక్షి ప్రతినిధి, అనంతపురం : ఇది వరకు ఎన్నికల సమయంలో ఓటు అడగడానికి వచ్చినపుడు మినహా గెలిచిన తర్వాత శాసనసభ్యులకు ఏ గ్రామం ఎక్కడుందో తెలిసేది కాదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక దేశ చరిత్రలోనే తొలిసారిగా గడప గడపకూ ఎమ్మెల్యేలు వెళ్లడం, ప్రభుత్వం నుంచి ఏమి లబ్ధి కలిగింది.. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకుని, వాటినీ పరిష్కరిస్తున్నారు. గడిచిన నాలుగేళ్లలో జిల్లాలోని 663 గ్రామ/వార్డు సచివాలయాలకుగాను ఇప్పటి వరకు 520 సచివాలయాల పరిధిలోని ప్రతి ఇంటినీ ఎమ్మెల్యేలు సందర్శించారు.

గతంలో పరిస్థితులు వేరు

గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ రాకమునుపు పరిస్థితి దారుణంగా ఉండేది. ముఖ్యంగా 2014-19 మధ్య కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో గ్రామంలో చిన్న సమస్య గురించి తెలపాలన్నా ఎక్కడో ఉన్న ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చేది. ఇదొక తంతు అయితే.. ఆ తర్వాత పనులు మంజూరై మొదలుపెట్టే సరికి మళ్లీ ఎన్నికలొచ్చేవి. ఒక ట్రాన్స్‌ఫార్మర్ పెట్టాలన్నా ఎమ్మెల్యే సిఫార్సు లేనిదే అయ్యేది కాదు. ఇలాంటి పరిస్థితికి ఇప్పుడు పూర్తిగా చరమగీతం పాడినట్టయింది.

కొన్ని సమస్యలు తక్షణమే పరిష్కారం

జన్మభూమి కమిటీలు లేవు. ఎమ్మెల్యే, ఎంపీపీ, సర్పంచ్ వంటి వారి సిఫార్సుల అవసరమే లేదు. ఇంటివద్దకు ఎమ్మెల్యే వచ్చినప్పుడు సామాజిక భద్రత పింఛన్లు, అమ్మఒడి, ఇంటి పట్టా ఇలా ఏదైనా సరే సమస్య చెబితే వారంలోగా పరిష్కారం అవుతున్నాయి. ఈ మార్పుతో ప్రజల్లో భరోసా ఏర్పడింది. ఎవరి సిఫార్సూ లేకుండా సంతృప్త స్థాయిలో సమస్యలు పరిష్కారం జరుగుతుండటంతో పల్లెల్లో రైతులు, కూలీలు, వృద్ధులు సంతోషంగా ఉన్నారు.



తాడిపత్రి డీఎస్పీ కార్యాలయం ఎదురుగా నిర్మించిన సీసీ రోడ్డు

రోజూ పర్యవేక్షణ



సచివాలయాల పరిధిలో జరుగుతున్న పనులపై రోజూ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తున్నాం. ఇప్పటికే చాలా పనులు పూర్తయ్యాయి. గ్రామీణ ప్రజలకు ఈ పనుల వల్ల మౌలిక వసతులు కలుగుతున్నాయి. కిందిస్థాయి అధికారులు దీనిపై ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలి.

– గౌతమి, కలెక్టర్, అనంతపురం

ఇదొక చక్కటి పరిష్కారం



టీడీపీ హయాంలో రాయదుర్గం నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధీ జరగలేదు. ఇప్పుడు జరుగుతున్న పనులే కాకుండా మరిన్ని పనులకు ముఖ్యమంత్రి నిధులిచ్చేందుకు హామీ ఇచ్చారు. త్వరలో ఆ పనులూ చేపడతాం. గ్రామాల్లో సమస్యలకు ఇదొక చక్కటి పరిష్కారం.

– కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

'గడప గడపకూ' పనుల వివరాలు

జిల్లాలో మొత్తం సచివాలయాలు	663
ఎమ్మెల్యేలు సందర్శించినవి	520
మొత్తం పనుల మంజూరు	2,300
నిధుల మంజూరు	రూ.72.80 కోట్లు
ఇప్పటివరకూ మొదలైన పనులు	2,115
ఇప్పటివరకూ పూర్తయిన పనులు	689
వెచ్చించిన వ్యయం	రూ.24.99 కోట్లు

విభాగాల వారీగా పనులు ఇలా..

విభాగం	మంజూరైన పనులు	జరుగుతున్న పనులు	పూర్తయినవి
పంచాయతీ రాజ్	1,109	1,031	292
గ్రామీణ నీటి సరఫరా	476	417	142
మున్సిపాలిటీ	607	569	242
ఎస్పీడీసీఎల్	108	98	13

మరింత నైపుణ్య విద్య

- పంజాబ్ వర్సిటీ, జేఎన్‌యూతో సెంట్రల్ యూనివర్సిటీ ఎంఓయూ



అవగాహన ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీలు

అనంతపురం: ఏపీ కేంద్రీయ విశ్వవిద్యాలయం (సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ)... పంజాబ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (పంజాబ్ -భటిండా), జేఎన్‌యూ (న్యూఢిల్లీ)తో సోమవారం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. దేశంలో ఉన్నత విద్యా సంస్థల సమూహం పేరుతో కుదుర్చుకున్న ఈ అవగాహన ఒప్పందంలో మూడు అత్యున్నత వర్సిటీలు ఉమ్మడి నిర్ణయాలు అమలు చేయనున్నాయి. న్యూఢిల్లీలో సోమవారం ఏపీ కేంద్రీయ విశ్వవిద్యాలయం పాలక మండలి సమావేశం జరిగింది. అనంతరం పంజాబ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, జేఎన్‌యూతో అవగాహన ఒప్పంద పత్రాలపై ఆయా వర్సిటీల ప్రతినిధులు సంతకాలు చేశారు. జేఎన్‌యూ వీసీ ప్రొఫెసర్ శాంతిశ్రీ ధూళిపూడి పండిట్, పంజాబ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ ఆర్.పి.తివారి, ఏపీ కేంద్రీయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఎస్ఏ కోరి సమక్షంలో అవగాహన ఒప్పందం జరిగింది. 1969లో స్థాపించిన జేఎన్‌యూ బోధన, పరిశోధన రంగాల్లో ప్రపంచ ఖ్యాతిగాంచింది. న్యాక్ గ్రేడింగ్‌లోనూ దేశంలో ప్రథమ స్థానంలో ఉందని కేంద్రీయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఎస్ఏ కోరి పేర్కొన్నారు. నూతన జాతీయ విద్యావిధానం అమలు, నైపుణ్య వ్యవస్థాపకతను సులభతరం చేయడం, వనరులను ఉమ్మడిగా వినియోగించుకోవడం తదితర అంశాలకు ఈ ఒప్పందం దోహదపడనుంది. ఉమ్మడి డిగ్రీ, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులను అందించడం, విద్యావేత్తల పరిశోధనల్లో సహకారం సదుపాయాలు, పరికరాలు, ఒకే వేదికను ఏర్పాటు చేసుకోవడం, గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, పీహెచ్‌డీ కోర్సులు, ఇంటర్న్‌షిప్, డిజర్టేషన్ పనుల సంయుక్త పర్యవేక్షణను సులభతరం చేయడం ఈ ఒప్పందం ముఖ్య ఉద్దేశమన్నారు.

దొంగ ఓట్లు తొలగించే వరకు పోరాటం

- ఆ ఓట్లతోనే గెలవాలని కేశవ్ పాట్లు
- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: నియోజకవర్గంలో దొంగ ఓట్లను జాబితా నుంచి తొలగించే వరకు తమ పోరాటం ఆగదని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు ఓటమి భయం మొదలవడంతో పది వేల దొంగ ఓట్లను అడ్డు పెట్టుకుని ఎలాగైనా గెలవాలని పాట్లు పడుతున్నాడని ధ్వజమెత్తారు. సోమవారం వై.రాంపురంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమ అనంతరం విశ్వేశ్వరరెడ్డి మీడియాతో మాట్లాడారు. 2019-20, 2020-21 సంవత్సరాలలో ఓటరుజాబితా సవరణ సందర్భంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా ఓట్లు తొలగించినందున అప్పటి నియోజకవర్గ ఎన్నికల అధికారులుగా పనిచేసిన శోభ స్వరూపరాణి, భాస్కర్ రెడ్డిలపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుందన్నారు. వాస్తవానికి ఆ అధికారులు ఏ తప్పూ చేయలేదని స్పష్టం చేశారు. అయితే ఓట్ల తొలగింపు వ్యవహారంలో అధికారుల సస్పెన్షన్‌పై టీడీపీ సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తోందన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో దాదాపు పది వేల దొంగ ఓట్లు ఉన్నట్లు తాము ఇప్పటికే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఇందులో అత్యధికంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి నివసిస్తున్నవారు, రెండు చోట్ల ఓట్లు కల్గి ఉన్నవారు ఉన్నారని, వీటిపై సమగ్ర విచారణ చేయాలని కోరామన్నారు. నాటి ఓట్ల తొలగింపును ఎన్నికల కమిషన్ ఎక్కడా తప్పు పట్టలేదన్నారు. కేవలం ప్రొసీజర్ ప్రకారం సమాచారం చేరవేయకుండా తొలగించారని మాత్రమే తప్పు పట్టిందని స్పష్టం చేశారు. అధికారులు టీడీపీ నేతల దుష్ప్రచారాలకు భయపడకుండా నిష్పక్షపాతంగా, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగానే ఓటరు జాబితాను సవరించాలని కోరారు.

గడువుకు ముందే అర్జీల పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమి, ఇతర అధికారులు

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం

అనంతపురం అర్బన్: గడువుకు ముందే అర్జీలు పరిష్కరించాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. ఏ ఒక్క అర్జీ రీ-ఓపెన్ కాకూడదని సూచించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'స్పందన'లో కలెక్టర్‌తో పాటు డిప్యూటీ కలెక్టర్లు నీలమయ్య, ఆనంద్, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు వేణుగోపాల్‌రెడ్డి, నరసింహారెడ్డి, జేడీఏ ఉమామహేశ్వరమ్మ ప్రజల నుంచి వివిధ సమస్యలపై 408 అర్జీలు స్వీకరించారు. అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సమస్యను పరిష్కరించే అవకాశం ఉన్నందునే ప్రజలు మన వద్దకు వస్తున్నారని, ప్రతి అధికారీ బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. సమస్యకు సరైన పరిష్కారం చూపకపోతే అర్జీ రీ-ఓపెన్ అవుతుందన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపించాలని చెప్పారు.

చేనేత వస్త్రాలు ధరించాలి

అధికారులు, ఉద్యోగులు ప్రతి శనివారం తప్పనిసరిగా చేనేత వస్త్రాలు ధరించాలని కలెక్టర్ గౌతమి ఆదేశించారు. చేనేత పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఈ క్రమంలో చేనేత పరిశ్రమను, కార్మికులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

అర్జీల్లో కొన్ని...

మాజీ సైనికుల కోటా కింద తనకు ప్రభుత్వం ఇచ్చిన భూమికి పట్టా ఇప్పించాలని అనంతపురం హెచ్చెల్సీ కాలనీకి చెందిన మాజీ సైనికుడు డి.కాశీం విన్నవించారు. సర్వే నంబరు 136-3,4లో తనకు 5 ఎకరాల భూమి ఇచ్చారన్నారు. అయితే తహసీల్దారు పట్టా ఇవ్వడం లేదని చెప్పారు. విచారణ చేయించిన పట్టా ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

- కోల్పోయిన భూమికి పరిహారం తక్కువగా ఇచ్చారని తాడిపత్రిలోని జయనగర్ కాలనీకి చెందిన వెంకటరమణ ఫిర్యాదు చేశాడు. తాడిపత్రి పొలం సర్వే నంబరు 1406లో తన భార్య లక్ష్మీదేవి పేరున ఉన్న 98 సెంట్ల భూమి బైపాస్ రోడ్డు నిర్మాణంలో పోయిందన్నారు. అయితే 75 సెంట్లకు మాత్రమే పరిహారం ఇచ్చారని చెప్పాడు. మిగిలిన 23 సెంట్లకు పరిహారం వచ్చేలా చూడాలని కోరాడు.
- పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వడం లేదని రాయదుర్గం మండలం కంచెనపల్లికి చెందిన వన్నూరుస్వామి అర్జీ అందజేశాడు. సర్వే నంబరు 326-2సిలో 3.23 ఎకరాలకు ప్రభుత్వం1989లో డి.పట్టా (డీఏ 2/96-1-89) మంజూరు చేసిందన్నాడు. పాసుపుస్తకం ఇప్పించి న్యాయం చేయాలని కోరాడు.

నాన్న వద్దు.. ఆస్తి ముద్దు

- తండ్రిని రోడ్డున పడేసిన సంతానం
- కాలు విరిగినా పట్టించుకోని వైనం



ఎస్.వెంకటరెడ్డి

అనంతపురం అర్బన్: తన అవసరాలు మానుకుని బిడ్డల ప్రగతికి తపించాడు. వారి భవిష్యత్తు కోసం రెక్కలు ముక్కలు చేసుకున్నాడు. ఆస్తులు కూడబెట్టాడు. పెళ్లిళ్లు చేశాడు. కూడబెట్టిన ఆస్తులూ పంచిచ్చాడు. ఇక్కడ వరకూ అంతా బాగున్నా.. ఆస్తులు పంచుకున్న బిడ్డలు మాత్రం ఆ తండ్రిని ఛీదరించుకున్నారు. పిడికెడు బువ్వ పెట్టడం కూడా భారమనుకున్నారు. నిర్దాక్షిణ్యంగా నడిరోడ్డుపై వదిలేశారు. తన గోడును కలెక్టర్ వద్ద చెప్పుకునేందుకు సోమవారం ఉదయం నడవలేని స్థితిలో దేక్కుంటూ కలెక్టరేట్‌కు వచ్చిన ఆయన్ను 'సాక్షి' పలకరించగా.. కన్నీటి వ్యథ బయటకొచ్చింది. వివరాలు ఆయన మాటల్లోనే..

'ఏం చెప్పను సారూ.. నా కష్టం పగోడికి కూడా రాకూడదు (కళ్లలో ఉబికి వస్తున్న నీటిని తుడుచుకుంటూ). నాది బుక్కరాయసముద్రం మండలం గోవిందపల్లి. నా పేరు వెంకటరెడ్డి. ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు. వ్యవసాయం చేసి బిడ్డలను పోషించాం. రెక్కలు ముక్కలు చేసుకుని పని చేసి మరింత పొలం కొన్నా. నా భార్య చనిపోయింది. బిడ్డలకు పెళ్లిళ్లు చేశా. పెద్దోడికి నాలుగు ఎకరాలు, రెండోవాడికి మూడు ఎకరాలు, ఓ కూతురికి ఇల్లు, ఎకరా భూమి ఇచ్చా. మరో కుమార్తెకు ఇచ్చేందుకు నా వద్ద ఏమీ మిగల్లేదు. ఆస్తులు పంచిచ్చిన తర్వాత బిడ్డలకు నేను భారమైపోయా. పిడికెడు బువ్వ పెట్టడం భారమనుకుని మూడేళ్ల క్రితం ఇంటి నుంచి గెంటేశారు. కొంత కాలం గొట్కూరు వద్ద అనాథాశ్రమంలో ఉన్నా. ఆ తర్వాత ఇక్కడే పెద్దాస్పత్రి (సర్వజనాస్పత్రి) వద్దకు చేరుకున్నా. దాతలు పెట్టే అన్నం తింటూ గోడవారన పడుకుంటున్నా. ఈ మధ్య నా కాలు విరిగినా చూసేందుకు పిల్లలు రాలేదు. ఆస్పత్రి వాళ్లే చికిత్స చేశారు. ఎక్కడికి వెళ్లాలన్నా నడవలేని స్థితిలో ఇలా దేక్కుంటూ పోవాలి.'

న్యాయం కోసం ఎస్పీ వద్దకు..

స్పందన కార్యక్రమంలో ఫిర్యాదులు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన పలువురు.. వెంకటరెడ్డి బాధను విన్న తర్వాత వారి కళ్లు చెమర్చాయి. 'పెద్దాయనా.. నీ బిడ్డలకు బుద్ధి రావాలంటే పోలీసులైతేనే మేలు. నీవు ఎస్పీ వద్దకెళ్లి బాధ చెప్పుకో' అంటూ సలహా ఇచ్చారు. 'ఆ సార్ ఎక్కడుంటాడో నాకు తెల్వదయ్యా.. మీరే అక్కడకు చేర్చి పుణ్యం కట్టుకోండి. అక్కడికి పోయేందుకు నా వద్ద డబ్బు కూడా లేదు' అంటూ వెంకటరెడ్డి తెలపడంతో.. అక్కడున్న వారు స్పందించి వెంటనే ఆటో మాట్లాడి వృద్ధుడిని ఎస్పీ కార్యాలయానికి చేర్చారు.

ఉర్రూతలూగించిన 'ఫ్లాష్ మాబ్'



వైద్య కళాశాల వార్షికోత్సవ సంబరాలు ప్రారంభం

అనంతపురం క్రైం: 'ఏ చీకటి చెరిపేయని కలనే కనాలి', 'బోటనీ పాఠం ఉంది.. మ్యాటనీ ఆట ఉంది', 'మారో మారో గోలీ మారో'.. తదితర పాటలకు వైద్య విద్యార్థులు డ్యాన్సులతో అదరగొట్టారు. ఓ వైపు స్టెప్పులతో దుమ్మురేపగా.. మరోవైపు నుంచి తోటి విద్యార్థులు ఈలలు, కేకలతో ఉత్సాహపరిచారు. అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల వార్షికోత్సవ సంబరాలు సోమవారం మొదలయ్యాయి. ఆడిటోరియం ముందున్న ప్రాంగణం వద్ద 'ఫ్లాష్ మాబ్' కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ నెల 23న స్టాల్స్ డే, 24న స్పోర్ట్స్ డే, 25న కాలేజీ డే, గోల్డ్ మెడల్స్ ప్రదానం ఉంటుందన్నారు. అనంతరం పోస్టు గ్రాడ్యుయేట్స్ (పీజీ), అండర్ గ్రాడ్యు యేట్ విద్యార్థులు ఆరు బృందాలుగా ఏర్పడి, ఒక్కో బృందం 20 నిమిషాల పాటు డ్యాన్స్‌లతో హుషారెత్తించారు. కార్యక్రమంలో అకడమిక్ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ శ్యాం ప్రసాద్, జీజీహెచ్ ప్రొఫెసర్ డాక్టర్ రవికుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణ్‌దీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



డ్యాన్సుతో అలరిస్తున్న వైద్య విద్యార్థినులు

క్లుప్తంగా

రైలు ఢీకొని యువకుడి మృతి


యువకుడి మృతదేహం

అనంతపురం సిటీ: స్థానిక రాజీవ్ కాలనీ రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని సోమవారం ఉదయం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ విజయకుమార్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడికి పాతికేళ్ల వయసుంటుందని నిర్ధారించారు. పింక్ కలర్ టీ షర్ట్, నేవీ బ్లూ కలర్ నైట్ ఫ్యాంట్ ధరించాడు. కుడిచేతిపై 'ఏవీ' అని, 'అమ్మ' అని తెలుగులో పచ్చబొట్టు ఉంది. రైలు ఢీకొనడం తోనే మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆచూకీ తెలిసిన వారు 99088 37888, 85002 38200కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

'పోలీసు స్పందన'కు 104 వినతులు


అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ కె. శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 104 వినతులు అందాయి. ఎస్పీ కె.శ్రీనివాస రావు స్వయంగా అర్జీలు స్వీకరించి, సమస్యపై బాధితులతో మాట్లాడారు. చట్టపరిధిలోని సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలంటూ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పోలీసు స్పందన కార్యక్రమంలో తప్పుడు ఫిర్యాదులు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. నిజాయితీ పరులైన బాధితులకు పోలీసులు అండగా నిలిచి న్యాయం చేకూరుస్తారన్నారు.

తాడిపత్రి వినాశనమే జేసీ లక్ష్యం

- ఆక్రమణలతో అభివృద్ధిని అడ్డుకుంటున్నారు
- మాస్టర్ ప్లాన్ ప్రకారం రహదారి విస్తరణకు సిద్ధమా?
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సవాల్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: 'తాడిపత్రి నాది, దీనిని కాపాడేందుకు ప్రజలకు అండగా నేను ఉంటాను' అని నిత్యం మోసపూరిత మాటలు చెప్పే మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి.. తాడిపత్రి వినాశనానికే కట్టుబడి ఉన్నాడని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మండిపడ్డారు. స్థానిక తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ 40 ఏళ్ల పాలనలో తాడిపత్రిని ఎంతో అభివృద్ధి చేశామంటూ గొప్పలు పోతున్న జేసీ సోదరులు వాస్తవానికి చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలందరికీ తెలుసునన్నారు. గత నాలుగేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన, చేస్తున్న, చేపట్టనున్న అభివృద్ధి పనులను అడ్డుకోవడమే లక్ష్యంగా జేసీ ప్రభాకర్‌రెడ్డి కుట్రలు సాగిస్తున్నారన్నారు. ప్రజలకు మంచి జరిగితే ఓర్వలేని మున్సిపల్ చైర్మన్ మూలంగా తాడిపత్రి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు చదువుకునేలా నాలుగు రోజులుగా కళాశాల ప్రహరీ నిర్మాణ పనులు సాగుతుంటే రాత్రికి రాత్రి తన అనుచరులతో కూలదోయించడం జేసీ ప్రభాకర్‌రెడ్డి అహంకారానికి నిదర్శనమన్నారు.

జేసీ ఓ పిరికి పంద

తన కుటుంబం మాత్రమే బాగుండాలనే ఆలోచనతో అరాచకాలకు ఊతమిస్తున్న జేసీ ప్రభాకరరెడ్డి నిజంగా ఓ పిరికి పంద అని అభివర్ణించారు. ఆయన ఆడుతున్న రాజకీయ క్రీడలో బలవుతున్నది అమాయకులైన టీడీపీ నాయకులు, కార్యకర్తలేనన్నారు. టీడీపీ తాడిపత్రి నియోజకవర్గ ఇన్‌చార్జిగా జేసీ అస్మిత్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించినా తాడిపత్రిలో మాత్రం ఉంచకుండా జాగ్రత్తలు తీసుకున్నారన్నారు. కుమారుడికి రాజకీయ ప్రయోజనాలను కల్పించడంలో భాగంగా తాడిపత్రి ప్రాంతంలో అలజడులు సృష్టించి, వాటి పర్యవసనాలు అస్మిత్‌రెడ్డిపై పడకుండా ఉండేందుకే దూరంగా పెడుతూ వస్తున్నాడన్నారు. ఈ విషయం తెలుసుకోకుండా జేసీ ప్రభాకరరెడ్డి పిలిచిన ప్రతిసారీ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన టీడీపీ కార్యకర్తలు ఆయన విసిరిన మాయా ఉచ్చులో చిక్కుకుని కేసుల్లో ఇరుక్కుంటున్నారన్నారు.

వీలైతే అభివృద్ధికి సహకరించు

ఇంత కాలం ప్రజాధనాన్ని దోచుకుని దాచుకున్న జేసీ ప్రభాకరరెడ్డి ఇప్పటికైనా అక్రమాలు మానుకుని అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే పెద్దారెడ్డి హితవు పలికారు. తాడిపత్రిలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నిర్మాణం, నందలపాడులో ఇంటి పట్టాల పంపిణీ, అంబేడ్కర్ నగర్ వద్ద వైఎస్సార్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్, మొన్నటికి మొన్న ఆటో నగర్‌లో పేదలకు ఇచ్చిన స్థలాలపై ఇలా అన్నింటినీ తన క్షుద్ర రాజకీయాలకు వాడుకుంటున్న జేసీ ప్రభాకరరెడ్డి నైజాన్ని గుర్తించాలని ప్రజలను కోరారు. దౌర్జన్యంతోనో.. లేదంటే కోర్టుల్లో కేసులు వేసో అభివృద్ధి పనులను అడ్డుకోవడం తప్ప ఓ ప్రజాప్రతినిధిగా ప్రజలకు చేసిన మేలు ఏమిటో చెప్పాలని నిలదీశారు. తాను చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక తాడిపత్రిలో అలజడులు సృష్టిస్తున్నారన్నారు. జేసీ ప్రభాకరరెడ్డిలో ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు విస్తరణకు సిద్ధపడాలని సవాల్ విసిరారు. సీబీ రోడ్డు నుంచి జేసీ ఇంటి ఎదుట రైల్వే ట్రాక్ మీదుగా తేరన్నపల్లి వరకూ 50, 60, 80, 1 20 అడుగుల విస్తీర్ణంతో రోడ్డు విస్తరణ చేపడితే, రహదారికి ఇరువైపులా ఆయా విస్తీర్ణం మేరకు ఇరువైపులా అవసరమైన స్థల సేకరణ, ఆక్రమణల తొలగింపు చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఈ పనులు పూర్తయితే ఈ మార్గం ఎక్స్‌ప్రెస్ హైవేను తలపిస్తుందన్నారు. ఇప్పటికైనా బురడీ బాబా వేషాలు కట్టబెట్టి పోలీసులపై చిందులు వేయడం, వీధి నాటకాలకు తెరలేపడం వంటివి మానుకోవాలని, లేకపోతే ప్రజలే తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని హెచ్చరించారు.

యువకుడి దుర్మరణం


వెంకటేష్ (ఫైల్)

పెనుకొండ రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం జిల్లా రాప్తాడు మండలం హంపాపురానికి చెందిన వడ్డే వెంకటేష్ (27).. పెనుకొండ సమీపంలోని కియా పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి విధులు ముగించుకుని అమ్మవారిపల్లి నుంచి గుట్టూరు వైపుగా నడుచుకుంటూ వెళుతుండగా కియా పోలీస్ స్టేషన్ ఎదురుగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని నిలపకుండా దూసుకెళ్లిపోయాడు. ఘటనపై కియా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కోలుకుంటున్న డీఈఓ


డీఈఓ సాయిరాం ఆరోగ్య పరిస్థితిని డీఎంహెచ్‌ఓ యుగంధర్‌కు వివరిస్తున్న బెంగళూరు వైద్యుడు

రాప్తాడు రూరల్: కోమాలో ఉన్న జిల్లా విద్యాశాఖాధికారి ఎం.సాయిరాం క్రమంగా కోలుకుంటున్నారు. ఈ మేరకు బెంగళూరులో ఆయన చికిత్స పొందుతున్న ఆస్టర్ సీఎంఐ వైద్యులు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రెండు రోజులుగా ఏ మాత్రం స్పందన లేని ఆయన సోమవారం పిలిస్తే కళ్లు తెరిచి చూస్తున్నారు. అయితే మాట్లాడలేకపోతున్నారు. ఇతర స్పందనలూ లేవు. కాగా, కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్ బెంగళూరుకు వెళ్లి డీఈఓ ఆరోగ్య పరిస్థితిపై అక్కడి వైద్యులతో మాట్లాడారు. మెదడుకు రక్తం పంపింగ్ చేసే నాళం, సంకేతాలు తీసుకెళ్లే నాళం అక్కడక్కడ క్లాట్ అయినట్లు వైద్యులు వెల్లడించారు. క్లాట్‌ను కరిగించే మందులు ఇస్తున్నట్లు వివరించారు. దీనికి తోడు చికిత్సకు ఇతర అవయవాలు అంతంత మాత్రంగానే సహకరిస్తుండడంతో కోలుకునేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉందన్నారు. ఇది వరకే గుండెకు సంబంధించి, బ్రెయిన్‌కు సంబంధించిన వ్యాధులతో బాధపడుతుండడం కూడా కాస్తా ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు.

రిమాండ్ ఖైదీ మృతి

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న ఓ ఖైదీ గుండె పోటుతో మృతి చెందాడు. ఈ మేరకు జిల్లా జైలు సూపరింటెండెంట్ రహమాన్ సోమవారం తెలిపారు. నంద్యాల జిల్లా బనగానపల్లి మండలానికి చెందిన కోనేటి వీరన్న (50) తన భార్యకు భరణం చెల్లించే విషయంలో నిర్లక్ష్యం వహించిన అంశానికి సంబంధించి న్యాయమూర్తి ఆదేశాల మేరకు నెల రోజుల క్రితం అక్కడి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ క్రమంలో జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా శిక్ష అనుభవిస్తున్న ఆయన ఆదివారం రాత్రి గుండెపోటుకు గురయ్యాడు. విషయాన్ని తెలుసుకున్న వెంటనే వీరన్నను అనంతపురంలోని సర్వజనాస్పత్రికి జైలు సిబ్బంది తరలించింది. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. ఘటనపై బీకేఎస్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రతి నిరుపేదకూ పక్కా ఇల్లు

- పూరి గుడిసెలు లేని రాష్ట్రమే జగనన్న లక్ష్యం
- మంత్రి కేవీ ఉషశ్రీచరణ్


గృహ నిర్మాణాలకు భూమిపూజ చేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం రూరల్: పూరి గుడిసెలు లేని రాష్ట్రం చూడాలన్నదే సీఎం వైఎస్ జగనన్న లక్ష్యమని మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి నిరుపేదకూ పక్కా ఇంటిని నిర్మించి ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కళ్యాణదుర్గం మండలం గోళ్ల పంచాయతీ కురాకులతోటలో సోమవారం వైఎస్సార్ జగనన్న కాలనీలో నూతన గృహ నిర్మాణాలకు సోమవారం ఆమె భూమిపూజ చేసి, మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని, బిల్లుల విషయంలో లబ్ధిదారులను ఇబ్బంది పెట్టకూడదని హౌసింగ్ ఏఈ లోక్‌నాథ్ చౌదరికి సూచించారు. లబ్ధిదారులు పునాది తీసిన వెంటనే ఫొటోలు అప్‌లోడ్ చేస్తే వెంటనే బిల్లులు మంజూరవుతాయన్నారు. పేదల పక్కా గృహాలు నిర్మించి ఇవ్వడంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందన్నారు. టీడీపీ హయాంలో కేవలం జన్మభూమి కమిటీ సభ్యులకు మాత్రమే గృహాలు నిర్మించి ఇచ్చారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా ఇళ్లతో పాటు సంక్షేమ పథకాలనూ అందజేస్తున్నామన్నారు. ఈ విషయంగా ఎక్కడేగాని వివక్షకు తావులేకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా వ్యవహరిస్తున్నారన్నారు. అనంతరం స్థానిక నాయకులతో ఆమె సమావేశమై మాట్లాడారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ బాలాజీ, జేసీఎస్ కన్వీనర్ ఆంజనేయులు, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ రహమాన్, స్థానిక నాయకులు మోహన్‌రెడ్డి, రామలింగప్ప, శ్రీనివాసులు, తిమ్మారెడ్డి, పోతేష్, గోవిందప్ప, కొండారెడ్డి, గోపాల్, నాగేంద్ర, మల్లికార్జున, రామకృష్ణ, రాము, బిక్కిహరి పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణులకు మెరుగైన సేవలందించాలి : డీఎంహెచ్‌ఓ

అనంతపురం క్రైం: హైరిస్క్ గర్భిణిను ప్రారంభ దశలోనే గుర్తించి వారికి మెరుగైన వైద్య సేవలందించాలని పీహెచ్‌సీ వైద్యాధికారులకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్ సూచించారు. ప్రమాదకర కాన్పులకు గురయ్యే గర్భిణులకు సుఖ ప్రసవం అయ్యేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పీహెచ్‌సీల వైద్యాధికారులకు సోమవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ప్రారంభించిన డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. అత్యవసరం సమయంలో అంబులెన్స్‌లు అందుబాటులో లేకుంటే తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం ద్వారా గర్భిణులను ఆస్పత్రికి తరలించాలని సూచించారు. కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి ఈ సేవలను పొందవచ్చునన్నారు. అనంతరం హైరిస్క్ గర్భిణులను గుర్తించడంపై వైద్యాధికారులకు గైనిక్ నిపుణురాలు డాక్టర్ కుముద శిక్షణ ఇచ్చారు. రక్తహీనత కలిగిన గర్భిణిలు, బీపీ, షుగర్, గుండె జబ్బులు, థైరాయిడ్, చిన్న వయసుకే గర్భం దాల్చడం, కాన్పు కాన్పుకు ఎడమ లేకపోవడం, మూర్ఛ తదితర లక్షణాలు కలిగిన వారిని గుర్తించి, తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ మహేంద్రనాథ్, డాక్టర్ కావ్య, డాక్టర్ రోహిణి పాల్గొన్నారు.

వ్యక్తి బలవన్మరణం


మృతుడు నారాయణస్వామి

తాడిపత్రి: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రి మండలం తేరన్నపల్లికి చెందిన నారాయణస్వామి (50), రాములమ్మ దంపతులకు ఓ కుమారుడు ఉన్నారు. వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో కుటుంబంలో కలహాలు చోటుచేసుకోవడంతో మనస్తాపం చెందిన నారాయణస్వామి సోమవారం సాయంత్రం పనులు ముగించుకుని ఇంటికి వెళ్లాడు. అనంతరం బయటకు వచ్చిన ఆయన మద్యం బాటిల్ కొనుగోలు చేసి, తనతో పాటు తీసుకెళ్లిన పురుగుల మందును కలుపుకుని గ్రామ శివారులోకి వెళ్లి తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న నారాయణస్వామిని గుర్తించిన అటుగా వెళుతున్న వారు సమాచారం అందించడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని వెంటనే తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై తాడిపత్రి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆరుకు చేరిన మృతుల సంఖ్య

తాడిమర్రి: విద్యుత్ ప్రమాదంలో మృతుల సంఖ్య ఆరుకు చేరుకుంది. గత ఏడాది జూన్ 30న పెద్దకోట్ల, గుడ్డంపల్లి గ్రామాలకు చెందిన మహిళలు ఆటోలో కూలి పనులకు వెళ్తుండగా చిల్లకొండయ్యపల్లి వద్ద 11 కేవీ విద్యుత్ తీగలు తెగి ఆటోపై పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఐదుగురు మహిళలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. తీవ్రంగా గాయపడిన గుడ్డంపల్లి గ్రామానికి చెందిన కొంకా గాయత్రి (29)ని కుటుంబసభ్యులు బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. కొన్ని నెలల పాటు అక్కడే చికిత్స పొందింది. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో ఇటీవల అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో చేర్పించారు. చికిత్సకు స్పందించక ఆదివారం రాత్రి ఆమె మృతి చెందింది. మృతురాలికి భర్త మంజునాథ్, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

క్లుప్తంగా

ఈ- క్రాప్ బుకింగ్ వేగవంతం చేయండి



ఈ- క్రాప్ బుకింగ్ చేస్తున్న వ్యవసాయాధికారులు

ఆత్మకూరు: ఖరీఫ్ సీజన్ కింద సాగు చేసిన పంటలను రైతులు ఈ క్రాప్ బుకింగ్ తప్పని సరిగా చేయించాలని ఏఓ సుచరిత, ఏఈఓ సుజిత తెలిపారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో పర్యటించి, ఈ క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలని వ్యవసాయ సిబ్బందికి సూచించారు. ఈ క్రాప్ బుకింగ్‌కి సంబంధించి ఏదైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలని వ్యవసాయ సిబ్బందికి సూచించారు.

దివ్యాంగులను ఆదుకోవాలి

అనంతపురం అర్బన్: దివ్యాంగులను ప్రభుత్వం ఆదుకోవాలని కలెక్టరేట్ ఎదుట వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో నాయకులు సోమవారం నిరసన తెలియజేశారు. వేదిక అధ్యక్ష, కార్యదర్శులు వసంతకుమార్, రామయ్య మాట్లాడారు. అనంతరం కలెక్టర్ గౌతమికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకుడు సాకే హరి, వేదిక ఉపాధ్యక్షుడు మారన్న, నాయకులు లక్ష్మీదేవి, రాజేశ్, సోము, వైష్ణవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలి



గాండ్లపర్తిలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ వెంకటేశ్వర ప్రసాద్

రాప్తాడు: మండలంలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని ఏఓ వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన ప్రసన్నాయపల్లి, బుక్కచెర్ల, గాండ్లపర్తి గ్రామాలను సందర్శించారు. ఏఓ మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాభావంతో ప్రధాన పంట అయిన వేరుశనగ 52 శాతం మాత్రమే సాగయ్యిందన్నారు. వేరుశనగ స్థానంలో కంది, ఆముదం, మొక్క జొన్న పంటలను ఎక్కువ మంది రైతులు సాగు చేశారన్నారు. వర్షాభావంతో బెట్ట ఏర్పడినప్పుడు 5 గ్రాముల పోటాషియం, నైట్రేట్ లేదా 5 గ్రాములు 19-19-19 లేదా ఒక గ్రాము యూరియా లీటర్ నీటికి కలిపి, వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. కంది, పత్తి, ఆముదం, మొక్క జొన్న పంటలకు ఆశించిన తెగుళ్ల నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ప్రత్యామ్నాయ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ జయరామిరెడ్డి

చెన్నేకొత్తపల్లి: పుట్టపర్తి సత్యసాయి బాబా భక్తురాలు సుధా శ్రీనాథ్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటును స్థానిక సర్పంచ్ జయరామిరెడ్డి సత్యసాయి భక్తుల ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు నాగభూషణం, హనుమంత రెడ్డి, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపు కంటి వైద్య శిబిరం

యాడికి: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద ఈనెల 23న ఉదయం 10 గంటలకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఉప సర్పంచ్ కాసా చంద్రమోహన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నంద్యాలకు చెందిన శాంతిరాం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సిబ్బంది వైద్య పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు.











అంద 'గూడు'.. గిజిగాడు!

మనిషితోపాటు పిట్టలకు కూడా ఆవాసం (గూడు) అత్యవసరమేననిపిస్తుంది. మనిషి చదువుతో నైపుణ్యం సంపాదించి ఇళ్లు, భవనాలు నిర్మిస్తాడు. పిట్టలు ఇంజినీరింగ్ డిగ్రీలు చదువుకోలేదు, పట్టాలు పుచ్చుకోలేదు. పిట్టలకు (గిజిగాడు) పుట్టుకతో నైపుణ్యం అబ్బిందేమో.. గూళ్లు నిర్మించడంలో కళాత్మకత ప్రదర్శిస్తాయి. గరికపుల్లలు, గడ్డిపోచలతో అందమైన గూళ్లు నిర్మించుకొని 'భళే..భళే అంద'గూడు'.. గిజిగాడు' అని మనిషిచేత మెప్పించుకుంటాయి. అనంతపురం రూరల్ మండలం నాగిరెడ్డిపల్లి సమీపంలో వ్యవసాయ బావుల్లోని చెట్లపై నిర్మించుకున్న గిజి'గూళ్ల'ను చూస్తే ఆశ్చర్యపోక తప్పదు. పొలాల వద్దకు వెళ్లే రైతులు, అటుగా వెళ్లే పాదచారులు, వాహనదారులు గిజిగాళ్ల అద్భుత కళను చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

ఆత్మకూరు: మండల కేంద్రం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. వివరాలు.. అనంతపురం పాతూరుకు చెందిన కృష్ణానాయక్, తన కుమార్తె ప్రత్యూష, మనువరాలు బృందం, 45 రోజుల మనవడితో కలిసి రాయదుర్గం మండలం రాతిబావి వంక గ్రామంలో జరిగిన శుభకార్యానికి కారులో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో రాయదుర్గం మండలం ఆవులదట్లకు చెందిన సమీప బంధువు లక్ష్మీబాయిని కారులో ఎక్కించుకున్నారు. కారు ఆత్మకూరు వద్దకు రాగానే అదుపుతప్పి రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మీబాయి తలకు తీవ్రగాయాలయ్యాయి. మిలిగిన ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్సనిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

రీ సర్వే నిర్లక్ష్యం చేయొద్దు

అనంతపురం క్రైం: రీ సర్వేను నిర్లక్ష్యం చేయకుండా నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, అడ్మిన్, పట్టణ ప్రణాళిక, శానిటేషన్ కార్యదర్శులకు అదనపు కమిషనర్ వివిధ కార్యక్రమాలపై పలు సూచనలు, సలహాలు అందించారు. అధిక సంఖ్యలోని సచివాలయాల్లో రీ సర్వేలో వెనుకబడ్డారని అసంతృప్తి వ్యక్తం చేశారు. చెత్త సేకరణకు సంబంధించి యూజర్ చార్జీలను వసూలు చేయాలన్నారు. ఇంటి, నీటి పన్ను వసూలు వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో ఆర్ఎంఓలు సతీష్, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

మట్టి మిగిలింది.. మొక్కలేవీ!



ఆత్మకూరు సచివాలయం-2 వద్ద నీరు లేక ఎండిపోయిన మొక్కలు

ఆత్మకూరు: మండల కేంద్రంలోని సచివాలయం -2 వద్ద ఇటీవల నాటిన మొక్కలు నీరులేక ఎండిపోయాయి. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అధికారులు పలు కార్యక్రమాలు నిర్వహించారు. నా భూమి – నాదేశం, నేలతల్లికి నమస్కారం- వీరులకు వందనం కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని ప్రతి పంచాయతీలో 75 మొక్కలు నాటాలని అధికారులు ఆదేశాలున్నాయి. కానీ మండలంలోని పలు పంచాయతీల్లో మాత్రం 75 మొక్కలు నాటాల్సిన చోట 10 మొక్కలు కూడా నాటలేదన్న విమర్శలు ఉన్నాయి. అధికారులు తూతూమంత్రంగా కార్యక్రమాలను నిర్వహించి, చేతులు దులుపుకున్నారు. దీంతో లక్ష్యం కాస్త ఎండుముఖం పట్టిందని ప్రజలు విమర్శిస్తున్నారు.

అదుపుతప్పి బోల్తాపడిన టమాటాల వాహనం



ఆత్మకూరు వద్ద బోల్తా పడిన టమాటాల వాహనం



రోడ్డుపై పడిపోయిన టమాటాల బాక్సులు

ఆత్మకూరు: మండల కేంద్రం సమీపంలో సోమవారం రాత్రి టమాటాల లోడు (ఐచర్ వాహనం) అదుపుతప్పి బోల్తాపడింది. పోలీసులు , స్థానికులు తెలిపిన మేరకు.. బెళుగుప్ప మండలం దగ్గర గుండ్లపల్లికి చెందిన ఐచర్ వాహనంలో 330 బాక్సుల టమాటాలు అనంతపురం మార్కెట్‌కు తీసుకెళ్తుండగా.. ఆత్మకూరు వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించేక్రమంలో ఐచర్ వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో టమాటాల బాక్సులు కిందపడిపోయి, టమాటాలు నేలపాలయ్యాయి. ప్రస్తుతం 15 కిలోల బాక్సు ధర మార్కెట్‌లో రూ.400 నుంచి రూ.500 వరకు పలుకుతోంది. ఐచర్‌లో ఉన్న డ్రైవర్ శేఖర్ , రైతు బడప్పకు స్వల్పగాయాలయ్యాయి.

వైభవంగా మాధవరాజుల విగ్రహ ప్రతిష్ట



విగ్రహప్రతిష్టలో పాల్గొన్న భక్తులు



మాధవరాజులస్వామి విగ్రహం

ఆత్మకూరు: మండలంలోని సనప మాధవరాజుల స్వామి నూతన విగ్రహ ప్రతిష్ట సోమవారం వైభవంగా జరిగింది. మూడురోజుల పాటు విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. సోమవారం ఆలయంలో మాధవరాజుల స్వామి నూతన విగ్రహాన్ని పండితుల మంత్రాల నడుమ ప్రతిష్ఠింప చేశారు. సపప గ్రామం నుంచే కాకుండా తోపుదుర్తి, రంగంపేట, బి.యాలేరు, మదిగుబ్బ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి వైఎస్సార్ సీపీనేత తోపుదుర్తి చందు హాజరై, స్వామికి పూజలు నిర్వహించారు.

ఆటోలో నుంచి జారిపడి వ్యక్తికి తీవ్ర గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని అనంతపురం రోడ్డులో సోమవారం ప్రమాదవశాత్తూ ఆటోలో నుంచి శ్రీరాములు అనే వ్యక్తి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. కర్నూలు జిల్లా మద్దికెరకు చెందిన శ్రీరాములు వ్యక్తిగత పని మీద బస్సులో గుత్తికి వచ్చాడు. అనంతరం ఆయన ఆటోలో పామిడికి బయలుదేరాడు. అయితే గుత్తి పట్టణ శివారులో ఆటోలో వెనుక కూర్చున్న శ్రీరాములు అదుర్లకు జారి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో శ్రీరాములు తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు అతడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

జోడు లింగాలకు ప్రత్యేక పూజలు



జోడు లింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

కూడేరు: మండల కేంద్రంలోని శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. జిల్లా నల మూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు శివశంకర్ శాస్త్రి, మహేష్, శివ స్వాములు జోడు లింగాలకు ప్రత్యేక పూజలు చేశారు.

27 నుంచి ఐటీఐలో ప్రవేశాలకు కౌన్సెలింగ్

గుంతకల్లుటౌన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఒకటి, రెండు కౌన్సెలింగ్‌లలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.నరేంద్రనాథ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్ పాసైన విద్యార్థినీ, విద్యార్థులు ఈనెల 27వ తేదీలోగా ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే ఒరిజినల్ సర్టిఫికెట్లను కళాశాలకు తీసుకొచ్చి వెరిఫికేషన్ చేయించుకోవాలని విద్యార్థులకు సూచించారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

కనగానపల్లి: మండలంలోని గ్రామ సచివాలయాల్లో మంగళవారం నుంచి ఆధార్ రిజిస్ట్రేషన్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో క్యాంపులపై షెడ్యూల్ విడుదల చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఆధార్ కార్డు రిజిస్ట్రేషన్, అప్‌డేట్ కోసం సచివాలయాల్లోనే ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. తొలిరోజు 22న తూంచర్ల గ్రామ సచివాలయం, 23న భానుకోట, 24న యలకుంట్ల, 25న దాదులూరు గ్రామ సచివాలయాల్లో ఈ క్యాంపు ఉంటుందన్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, విద్యార్థులు సమీప గ్రామ సచివాలయం వద్దకు వెళ్లి ఆధార్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న మొబైల్ ఆధార్ క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ విజయ భాస్కర్ తెలిపారు. ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకూ 3 రోజుల పాటు ఈ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈనెల 22, 23న చెదుల్ల, కేకే అగ్రహారం , 24, 25న రెడ్డిపల్లి, వెంకటాపురం సచివాలయాల్లో మొబైల్ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు ఆధార్ అప్‌డేట్, కొత్త ఆధార్ కార్డులు, పేర్లు, చిరునామా మార్పు వంటివి చేసుకోవచ్చన్నారు.

తాడిపత్రిలో 30 పోలీస్ యాక్ట్



పట్టణంలో కవాతు చేస్తున్న పోలీసులు

తాడిపత్రి: పట్టణంలో శాంతిభద్రతల దృష్ట్యా 30 పోలీస్ యాక్ట్‌ను అమలు చేస్తున్నట్లు డీఎస్పీ సీఎం గంగయ్య తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి యల్లనూర్ రోడ్డు సర్కిల్ వరకు పోలీసులతో కలసి కవాతు నిర్వహించారు. అనంతరం డీఎస్పీ గంగయ్య మాట్లాడుతూ.. పట్టణంలో శాంతిభద్రతలు ఇప్పటి వరకూ అదుపులోనే ఉన్నాయన్నారు. వాటికి భంగం కలగకుండా ఉండేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ఇకపై పట్టణంలో ఎవరైనా ర్యాలీలు, ధర్నాలు, నిరసనలు చేపడితే అందుకు ముందస్తుగా పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా ర్యాలీలు ధర్నాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అడవి జంతువులు కనిపిస్తే సమాచారమివ్వండి

కళ్యాణదుర్గం: అడవి జంతువులు కనిపిస్తే సంచారం సమాచారం ఇవ్వాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రాంసింగ్ తెలిపారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లులో ఇటీవల చిరుత కనిపించింది. గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో సిబ్బందితో కలిసి ఆయన గ్రామ సమీపంలోని గుట్టల్లో చిరుత సంచరించిన ప్రదేశాలను పరిశీలించారు. రాత్రి సమయాల్లో రాతి బండరాళ్ల మధ్య స్థావరం ఏర్పాటు చేసుకుందన్నారు. అయితే ఆహారం కోసం ఒకచోట నుంచి మరోచోటకు వెళ్తుందని తెలిపారు. పొలాల్లోకి వేకువజామునే వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వన్య మృగాలు సంచరిస్తున్నట్లు తెలిస్తే వెంటనే అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి ఎంపీ పరామర్శ



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నప్పను పరామర్శిస్తున్న ఎంపీ తలారి రంగయ్య

అనంతపురం క్రైం: నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కళ్యాణదుర్గం మండలం కొండాపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణస్వామి తండ్రి చిన్నప్పను ఎంపీ తలారి రంగయ్య సోమవారం పరామర్శించారు. ఎంపీ వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయ తిప్పేస్వామి ఉన్నారు.

విధుశేఖర భారతీమహాస్వామి వర్ధంతి



రుద్ర హోమం చేస్తున్న పండితులు


అనంతపురం కల్చరల్: ప్రసిద్ధి చెందిన దక్షిణామ్నాయ శృంగేరి శారదా పీఠాధిపతులు జగద్గురు విధుశేఖర భారతీమహాస్వామి 31వ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శారదా నగర్‌లోని శంకర మఠంలో ఉదయం వేదపండితులు శాంతి హోమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఆదిశంకరాచార్యులు, చంద్రమౌళీశ్వరస్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, నాగేశ్వరి పూజలు, గణపతి, ఆయుష్షు, రుద్ర, సర్పసూక్త హోమాలు నిర్వహించారు. శివసహస్ర నామావళి పారాయణం, రాత్రి రథోత్సవం నిర్వహించారు. గరుడ పంచమి కలిసి రావడంతో నాగ దేవతలకు శంకర మఠంతో పాటు వివిధ ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

మహాకవి జాషువాపై జాతీయ వెబినార్


అనంతపురం కల్చరల్: రాయలసీమ జాగృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహాకవి గుర్రం జాషువా 128వ జయంతి సందర్భంగా జాతీయ వెబినార్ నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ సాకే శ్రీహరి మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. సాహితీ అభిమానులు, అధ్యాపకులు, ఆచార్యులు, రచయితలు జాషువా వైశిష్ట్యాన్ని వివరించే వ్యాసాలను ఈనెల 31లోపు పంపాలని, మరిన్ని వివరాలకు సెల్: 9866216044లో సంప్రదించాలన్నారు.

రేపు జయలక్ష్మి, అన్నపూర్ణేశ్వరి విగ్రహ ప్రతిష్టలు

- నేడు బొమ్మేపర్తికి గణపతి సచ్చిదానంద స్వామీజీ రాక



గణపతి సచ్చిదానందస్వామీజీ



జయలక్ష్మిమాత

అనంతపురం కల్చరల్/రాప్తాడు : అనంతను ఆధ్యాత్మికంగా అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన కొద్దిమందిలో గణపతి సచ్చిదానంద స్వామీజీ ఒకరు. ఆయనతో రాప్తాడు మండలంలోని బొమ్మేపర్తికి కూడా అంతే ఖ్యాతి వచ్చింది. దేశ విదేశాల్లో ఆయనకు భక్తులు ఉన్నారు. స్వామీజీ మంగళవారం నుంచి ఐదురోజుల పాటు బొమ్మేపర్తిలో ఉండి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. సాక్షాత్తూ అమ్మవారి స్వరూపంగా, శ్రీరాజరాజేశ్వరి అవతారంగా భాసిల్లుతోన్న జయలక్ష్మి మాత విగ్రహావిష్కరణ, అన్నపూర్ణేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్టలు జరగనున్నాయి. దీంతో ఇప్పటికే పలు ప్రాంతాల నుంచి ఆధ్యాత్మిక వేత్తలు, భక్త జన సంఘాలు బొమ్మేపర్తి చేరుకుంటున్నారు.

త్రిమూర్త్యాకారుడైన దత్తాత్రేయ స్వరూపం :
వందల ఏళ్ల ఆధ్యాత్మిక చరిత్ర ఉన్నట్టు స్వామీజీపై పరిశోధనలు చేసిన వారు ఆసక్తికరమైన విషయాలను తెలియజేశారు. అమ్మవారి స్వరూపమైన జయలక్ష్మి మాత దత్తాత్రేయ అవతారంగా జన్మించిన సత్యనారాయణకు (గణపతి సచ్చిదానంద స్వామీజీ పూర్వాశ్రమంలోని పేరు) 'మహా శక్తిపాతాన్ని' అందించిన పవిత్ర ఆంజనేయ స్వామి ఆలయం, బ్రహ్మ విష్ణు, మహేశ్వరుల ప్రతిరూపాలు ఈ గ్రామంలో ఉన్నాయి. స్వామీజీ అనతి కాలంలోనే ఆధ్యాత్మిక శక్తిగా మారి వేద వేదాంగాల్లోని సారాన్ని పలు రూపాల్లో అందిస్తున్నారు. మైసూరుతో పాటు 'అనంత' నడిబొడ్డున దత్తాత్రేయ ఆశ్రమాలు నిర్మించారు.



స్వామీజీ తండ్రి నరసింహశాస్త్రి బొమ్మేపర్తి గ్రామంలో పరమ పవిత్రమైన ఆశ్రమం స్వామీజీ చేతుల మీదుగా ఆరంభమైంది. ఇక్కడ స్వామీజీ తల్లిదండ్రుల బృందావనాలు, ఉచిత పాఠశాల, ఆరోగ్య కేంద్రాలు నిత్యం భక్తులకు ఆధ్యాత్మికతను పంచుతున్నారు.

జయలక్ష్మిపురానికి ఆధ్యాత్మిక శోభ :
గణపతి సచ్చిదానంద స్వామీజీ రానుండడంతో ఆశ్రమ పరిసరాలు (జయలక్ష్మిపురం) సుందరంగా ముస్తాబయ్యాయి. జయలక్ష్మమ్మ, నరసింహశాస్త్రి గండ్లూరి ట్రస్టు, శ్రీ సచ్చిదానంద జ్ఞానబోధ సభ ట్రస్టు ఆధ్వర్యంలో 22న సహస్ర చంద్ర భవనం ప్రారంభిస్తారు. 23న జయలక్ష్మి మాత, అన్నపూర్ణేశ్వరి అమ్మవార్ల నూతన విగ్రహ ప్రతిష్టలు కూడా స్వామీజీ చేతుల మీదుగా సాగుతాయి. 24న శ్రీనరహరి తీర్థ స్వామి వారి ఆరాధన, ఏకాదశ వార రుద్రహోమం, సంస్కారహీన శివరూప దత్తాత్రేయస్వామి జయంతి వేడుకలు జరుగుతాయి. 25న వేలాది మంది మహిళలతో సామూహిక వరలక్ష్మి వ్రతాలు జరగనున్నాయి. ఆదేరోజు సాయంత్రం శాస్త్రీయ నృత్యాలతో కళాకారులు అమ్మవారికి నాట్య నీరాజనాలర్పిస్తారు. అనంతరం స్వామీజీ మైసూరు బయల్దేరి వెళ్తారు.